క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ రోగులను పర్యవేక్షించాలి

• ఆరోగ్యశ్రీ ఇన్‌చార్జి కో ఆర్డినేటర్



సమావేశంలో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ అప్పారావు

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్య సేవ) పథకం కింద నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చికిత్స పొందే రోగులను ఆరోగ్యమిత్రాలు ప్రతీ రోజు పరిశీలించాలని ఆరోగ్యశ్రీ ఇన్‌చార్జి కో ఆర్డినేటర్ డాక్టర్ కొయ్యాన అప్పారావు అన్నారు. స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆరోగ్య మిత్రాలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమయపాలన కచ్చితంగా పాటించాలన్నారు. అర్హులందరికి ఆరోగ్యశ్రీ అందే విధంగా చూడాలని తెలిపారు. హెల్త్‌కార్డు లేని వారికి సీఎంసీఓ లెటర్స్ పెట్టి చికిత్స అందించాలన్నారు. సమావేశంలో డీఎం రాంబాబు, టీమ్ లీడర్స్ భాను, దేవి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

అంకాలజిస్ట్‌కు సన్మానం



డాక్టర్ విజయలక్ష్మిని సన్మానిస్తున్న సేవా సంస్థ సభ్యులు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అంకాలజిస్ట్ డాక్టర్ పోతుల విజయలక్ష్మిని మాతృభూమి సేవా సంస్థ వారు ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం సర్వజన ఆస్పత్రిలో సన్మానించారు. కార్యక్రమంలో సేవా సంస్థ ప్రతినిధి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

కుమిలి ఆర్‌బీకేలో యూరియా కొరత



కుమిలిలో యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి ఆర్‌బీకేలో యూరియా కొరత కారణంగా రైతులు ఇబ్బంది పడుతున్నారు. గత కొన్ని రోజులుగా యూరియా కొరత వుండటంతో రైతులు కేంద్రం వద్దకు వచ్చి నిరాశతో వెనుదిరుగుతున్నారు. రబీ సీజనులో సాగుకు ప్రధానంగా అవసరమైన యూరియా లేకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ

డెంకాడ: మండలంలోని విజయనగరం–కుమిలి ప్రధాన రహదారిలో గుణుపూరుపేట గ్రామంలో సీసీ కెమెరాలను మంగళవారం ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన 7 సీసీ కెమెరాలను ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పలు ప్రధాన రహదారుల్లోని ప్రధాన కూడళ్లలో దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నేర పరిశోధనకు సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలు చాలా ఉపయోగపడతాయని తెలిపారు.

సృజనాత్మక శక్తిని పెంచడానికి కృషి చేయాలి

• కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్

విజయనగరం అర్బన్: విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించడానికి లీడ్ ఇండియా ఫౌండేషన్ ద్వారా కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. లీడ్ ఇండియా సంస్థ బృందం కలెక్టర్‌ను మంగళవారం కలిసింది. పిల్లల్లో లీడర్ షిప్ లక్షణాలు, విలువలు, నైపుణ్యం, ఆలోచన శక్తిని పెంచడం తదితర అంశాలపై అవగాహన కలిగించడానికి లీడ్ ఇండియా ద్వారా కృషి చేస్తున్నామని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ ఈ శిక్షణలు పిల్లలకు ఏ విధంగా పని చేస్తాయో పరిశీలంచి ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని డీఈఓ మాణిక్యంనాయుడుకు సూచించారు. సమావేశంలో లీడ్ ఇండియా ప్రతినిధులు బాలాజీ, ఉమ, తమ్మన్న శెట్టి, ఇందిరా మణి, అరుణకుమారి, విజయలక్ష్మి, సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల బిల్లుల ఊసెత్తని కూటమి సర్కారు



పిట్టపేట జగనన్న కాలనీలో నిర్మాణమైన గృహాలు

• నిరుపేదల సొంతింటి కల నెరవేర్చిన వైఎస్సార్‌సీపీ
• నెల్లిమర్ల నియోజకవర్గంలో 5494 గృహాల మంజూరు
• సుమారు 3300 ఇళ్ల నిర్మాణాల పూర్తి

పూసపాటిరేగ: ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనేది ఆకాంక్ష. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఎన్నో నిరుపేద కుటుంబాలకు సొంత ఇళ్లు లేక అద్దె గృహాలు, పూరిపాకలలో గడిపిన పరిస్థితి. ఈ పరిస్థితుల్లో 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి సొంత ఇల్లు మంజూరు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వ స్థలం వున్న చోటే ఇల్లు మంజూరు చేశారు. ప్రభుత్వ స్థలం లేని చోట ప్రైవేటు వ్యక్తులు స్థలాలు కొనుగోలు చేసి జగనన్న కాలనీల పేరిట గ్రామాలే నిర్మించారు. ఇంటి స్థలం మంజూరు చేయడమే కాక ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు బిల్లుగా మంజూరు చేశారు. 2019 నుంచి 2024 మే నెల వరకు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో నవరత్నాలు, పేదలందరికి గృహాలు అనే నినాదంతో ప్రభుత్వం పేదలందరికి గృహాలు మంజూరు చేసింది. నిరుపేదల గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి గృహాల బిల్లులు వెంట వెంటనే మంజూరు చేయించారు. గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఇళ్లు మంజూరు నుంచి బిల్లులు మంజూరు వరకు పారదర్శకత తీసుకురావడంతో ఇళ్ల నిర్మాణం చకచకా సాగింది. తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు గృహ నిర్మాణాలపై పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. నెల్లిమర్ల నియోజకవర్గంలో పేదల గృహాలకు అప్పట్లో రూ.150 కోట్లు వరకు ప్రభుత్వం వెచ్చించింది. నెల్లిమర్ల నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 5494 గృహాలు మంజూరు చేసి 2024 మే నెల నాటికి 1347 గృహాలు నిర్మాణాలు పూర్తి చేశారు. వాటిలో మిగతా గృహాలు వివిధ నిర్మాణ దశలో వున్నాయి. భోగాపురం మండలంలో 1586 గృహాలు మంజూరు కాగా వాటిలో 391 గృహాలు నిర్మాణాలు పూర్తయ్యాయి. డెంకాడ మండలంలో 1951 గృహాలు మంజూరు కాగా 401 గృహాలు నిర్మాణాలు పూర్తయ్యాయి. పూసపాటిరేగ మండలంలో 1366 గృహాలు మంజూరు కాగా వాటిలో 248 గృహాలు నిర్మాణాలు పూర్తయ్యాయి. నెల్లిమర్ల మండలంలో 383 గృహాలు పూర్తి కాగా వాటిలో 194 గృహాలు నిర్మాణాలు పూర్తయ్యాయి. నెల్లిమర్ల నగర పంచాయతీలో 208 గృహాలు మంజూరు కాగా వాటిలో 113 గృహాలు నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతా గృహాల నిర్మాణాలు వివిధ దశలలో వున్నాయి. గత వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరైన గృహాలలో 40 శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోగా, 50 శాతం ఇళ్ల నిర్మాణాలు వివిధ దశలలో వున్నాయి. మిగతా 10 శాతం గృహాలు నిర్మాణాలు ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బిల్లులు సకాలంలో జమ కాకపోవడంతో గృహ నిర్మాణాలు మందగించాయి.

జగనన్న సొంతింటి కల నెరవేర్చారు

ఎంతో కాలంగా ఇల్లు లేక ఇబ్బంది పడ్డాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత స్థలాలు కొనుగోలు చేసి గృహాలు మంజూరు చేశారు. ఇంటి నిర్మాణానికి బిల్లులు సకాలంలో మంజూరు చేయించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నిరుపేదలందరికి న్యాయం జరిగింది.

– తల్లిరి రోజా, పిట్టపేట, పూసపాటిరేగ మండలం

ఉమా సదా శివుడి కల్యాణానికి వేడుకగా పందిరి రాట

• రేపు స్వామివారి వార్షిక కల్యాణోత్సవం



ఉమా సదాశివాలయం ప్రాంగణంలో పందిరి రాట వేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామివారి దేవస్థాన క్షేత్ర పాలకుడిగా విరాజిల్లుతున్న శ్రీ ఉమా సదాశివాలయంలో పందిరిరాట మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ప్రధాన అర్చకుడు రేజేటి మల్లిఖార్జున శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలనంతరం తూర్పు రాజగోపురం ప్రాంగణంలో వేద మంత్రోచ్చరణ, మంగళవాయిద్యాల నడుమ పందిరి రాటను వేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ నెల 6న రాత్రి 9 గంటలకు ఉమా సదాశివస్వామి వారి వార్షిక కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపిస్తామని ఆలయ అర్చకస్వామి మల్లిఖార్జున శర్మ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఈఓ వై.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ ద్వారా అభివృద్ధి పనులు : కలెక్టర్



వీఎంఆర్‌డీఏ అధికారులతో కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్ తదితరులు

విజయనగరం: విజయనగరం కార్పొరేషన్ పరిధిలో పలు రహదారులు, పార్కుల అభివృద్ధిని విశాఖపట్నం మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ అయిన వి.ఎం.ఆర్.డి.ఎ ద్వారా చేపట్టడానికి ప్రతిపాదనలు చేసినట్లు కలెక్టర్ డా.బి.ఆర్.అంబేడ్కర్ తెలిపారు. మంగళవారం ఆయన ఛాంబర్ లో వి.ఎం.ఆర్.డి.ఎ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ , జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌తో చర్చించారు. స్థానిక ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ నుంచి ధర్మపురి, ఐనాడా వరకు, జేఎన్‌టీయూ మెడికల్ కాలేజ్ రోడ్లను అభివృద్ధి చేయడానికి ప్రతిపాదించినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే రింగ్ రోడ్డు వద్ద పీఎస్ ఆర్ పార్కు, అయ్యన్నపేట వద్ద పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆనంద గజపతి ఆడిటోరియం ఆధునీకరణ, ఆడిటోరియం వద్ద డిజిటల్ లైబ్రరీ, స్టడీ సెంటర్, కమర్షియల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేసినట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, కె.ఆర్.ఆర్.సి డిప్యూటీ కలెక్టర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానం భూములపై సర్వే



విచారిస్తున్న రెవెన్యూ అధికారులు

పూసపాటిరేగ: మండలంలోని తమ్మయ్యపాలెం శ్మశాన భూములపై రెవెన్యూ అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. సర్వేయర్ గణపతి రావు, వీఆర్‌ఓ లక్ష్మణరావు ఆధ్వర్యంలో సర్వే చేశారు. తమ్మయ్యపాలెం గ్రామానికి చెందిన సర్వే నంబరు 112-5లో 3.44 సెంట్లు, 112-6లో 3.44 సెంట్లలో ప్రస్తుతం శ్మశాన వాటిక ఉంది. అయితే ఈ స్థలాన్ని తమకు కేటాయించాలని మత్స్యకార నాయకుడు బర్రి నూకరాజు, తవిటయ్యలు అధికారులను కోరారు. గతంలో అదే సర్వే నంబర్లలో రికార్డులు ప్రకారం ఎస్‌ఎఫ్‌సీలో జిరాయితీగా వుండటంతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని, ఇప్పుడు గయాలిగా నమోదైనట్లు చెబుతున్నారని ఆయా నంబర్లలో భూమి అనుభవదారులు అధికారులకు తెలియజేశారు. ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు రెవెన్యూ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలాన్ని రికార్డు చేసుకున్నారు. గ్రామ సర్పంచ్ ఆకుల పైడిరామ్ తదితరులు ఉన్నారు.

బడ్జెట్‌లో దళిత ఆదివాసీలపై వివక్ష



బడ్జెట్ వివరాలు వెల్లడిస్తున్న చిట్టిబాబు తదితరులు

• డీబీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు

విజయనగరం ఫూల్‌బాగ్: కేంద్ర బడ్జెట్‌లో దళిత ఆదివాసీల సంక్షేమంపై వివక్ష చూపారని డీబీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు ధ్వజమెత్తారు. దళిత బహుజన శ్రామిక యూనియన్, నేషనల్ క్యాంపెయిన్ ఆన్ దళిత్ హ్యూమన్ రైట్స్ వారి ఆధ్వర్యంలో స్థానిక డీబీఎస్‌యూ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ దళిత ఆదివాసీల కేటాయింపులు అనే అంశంపై విశ్లేషించారు. ఈ సందర్భంగా దళిత ఆదివాసీ బడ్జెట్ విశ్లేషణ నివేదికను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత ఆదివాసీలపై కేంద్ర బడ్జెట్‌లో వివక్షత చూపడం తగదన్నారు. నీతి అయోగ్ ఆదేశాల ప్రకారం ఎస్సీలకు జనాభా నిష్పత్తి ప్రకారం రూ.2,30,132 కోట్లు కేటాయించాల్సి ఉండగా రూ.1,68,478 కోట్లు మాత్రమే కేటాయించారని ధ్వజమెత్తారు. ఈ బడ్జెట్లో రూ.62,150 కోట్లు మాత్రమే నేరుగా ఉపయోగపడే పథకాలకిచ్చి మిగతా నిధులు సాధారణ పథకాలకు దారి మళ్లించడం వలన వికసిత భారత్‌లో దళిత ఆదివాసీ సంక్షేమం ప్రశ్నార్థకమే అని అన్నారు. ఎస్టీలకు కేటాయించిన రూ.1,29,250 కోట్లలో రూ.51,492 మాత్రమే నేరుగా ఎస్టీలకు ఉపయోగపడే పథకాలకిచ్చి మిగతా నిధులన్నీ సాధారణ పథకాలకు కేటాయించారన్నారు. కార్యక్రమంలో డొమెస్టిక్ వర్కర్స్ కోఆర్డినేటర్ కోరుకొండ వరలక్ష్మి, డీబీఎస్‌యూ జిల్లా నాయకులు వంగలపూడి కార్తీక్, దళిత మహిళ విభాగం కన్వీనర్ బెల్లాన రమ్య, దళిత ఐక్యవేదిక నాయకురాలు పలికల లక్ష్మి, రాయి శోభ తదితరులు పాల్గొన్నారు.

రామనారాయణంలో రథసప్తమి పూజలు

విజయనగరం రూరల్: మండలంలోని రామనారాయణం ఆధ్యాత్మిక కేంద్రంలో మంగళవారం రథసప్తమి సందర్భంగా ఆలయంలో సూర్యదేవుడికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ముందుగా పాలు పొంగించి స్వామివారికి నివేదన చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

శివపంచాయతన ఆలయంలో..

విజయనగరం టౌన్: రథసప్తమి పర్వదినాన విజయనగరం బాబామెట్ట శివపంచాయతన ఆలయంలో స్వామివారికి మంగళవారం వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. గుమ్చీ వద్దనున్న అతిపురాతనమైన సూర్యదేవాలయంలో విశిష్టపూజలు నిర్వహించారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారికి మంగళవారం ప్రత్యేక రోజు కావడంతో చదురుగుడిలో అమ్మవారు భక్తులకు పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. వేకువజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎన్నికల ప్రచారం

నెల్లిమర్ల: గాడి తప్పుతున్న విద్యారంగ వ్యవస్థను సరిదిద్దేందుకు పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్(1938), మిత్ర సంఘాలు బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు విజయం సాధించడం అవసరమని ఆయా సంఘాల రాష్ట్ర అధ్యక్షులు ఎం.కృష్ణయ్య, జి.హృదయరాజు అన్నారు. నెల్లిమర్ల మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని విద్యా రంగ సమస్యల పరిష్కారానికి గాదె గతంలో ఎమ్మెల్సీగా ఎంతో కృషి చేశారని అన్నారు. ఆయా సంఘాల నాయకలు పాల్గొన్నారు.

కళాక్షేత్రంలో బాలోత్సవం



బాలోత్సవంలో పాటలు పాడుతున్న భీష్మారావు శిష్యబృందం

విజయనగరం టౌన్: స్థానిక ఆనందగజపతి కళాక్షేత్రంలో మంగళవారం నిర్వహించిన బాలోత్సవం చూపరులను ఆకట్టుకుంది. చిన్నారుల్లో కళలను వెలికితీసే విధంగా పోటీలను నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులు తెలిపారు. కథారచన, పాటలు పాడటం, పద్యాలు పాడటం, మట్టితో బొమ్మలు చేయడం, ఫోక్ డ్యాన్స్, ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటేషన్, నాటికలు, ఏకపాత్రాభినయం వంటి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ధవళ సర్వేశ్వరరావు, చలం, చిన్నాదేవి, శ్రీనివాసరావు, ఎమ్.భీష్మారావు, డప్పు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి సాయం



ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న 45 రోజుల చిన్నారికి జిల్లా ఆర్యవైశ్య చారిటీ గ్రూప్ వైద్య ఖర్చులు నిమిత్తం ఆర్థిక సాయం చేసింది. స్థానిక రౌతు వీధికి చెందిన తెలుగంటి గోవిందరావుకు 45రోజులు కిందట కుమారుడు జన్మించాడు. పుట్టుక నుంచి ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న కారణంగా సర్జరీ చేయవలసి వచ్చింది. ఆర్థికంగా వెనుకబడిన గోవిందరావు చారిటీ గ్రూప్‌ను సంప్రదించారు. మంగళవారం శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం వద్ద బిడ్డ కుటుంబ సభ్యులకు రూ.52 వేలు అందజేశారు. గ్రూప్ అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్, కార్యదర్శి డిమ్స్ రాజు, కోశాధికారి సముద్రాల నాగరాజు, పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, ఆర్యవైశ్య మహాసభ పట్టణ అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు, వాసవి క్లబ్ అధ్యక్షుడు విజ్జపు విజయ్ కుమార్, కార్యదర్శి కె.వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం

ఉపాధి లక్ష్యాలను సాధించాలి



ఉపాధి హామీ పథకం లక్ష్యాలను సకాలంలో సాధించేలా క్షేత్ర స్థాయి సిబ్బంది చర్యలు చేపట్టాలని డ్వామా పీడీ ఎస్.శారదాదేవి ఆదేశించారు. మండలంలోని జగ్గరాజుపేట, ఏటీ అగ్రహారం గ్రామాల్లో మంగళవారం ఆమె పర్యటించారు. మినీ గోకులాల షెడ్డులతో పాటు ఇంకుడు గుంతల తవ్వకాల పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ పనులు, గోకులాలు, వేతనదారులకు పనిదినాల కల్పనపై ఆరా తీశారు. పనుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి పంచాయతీలో జూన్ నాటికి 25 చొప్పున ఫారం పాండ్స్, ఒక షిప్ పాండ్, 20 ఎకరాల్లో రింగ్ ట్రెంచ్‌లు, పశువుల షెడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఏపీఓ అరుణకుమారి, సిబ్బంది పాల్గొన్నారు. – నెల్లిమర్ల రూరల్

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ



కేన్సర్ లక్షణాలు ప్రాథమిక దశలో గుర్తించినట్లయితే నయం చేయవచ్చునని రెల్లివలస పీహెచ్‌సీ వైద్యాధికారిణి బాగ్యరేఖ అన్నారు. మండలంలోని రెల్లివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేన్సర్ లక్షణాలు కనిపించిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులకు తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్య సలహాలు పాటించాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ రమణమ్మతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. – పూసపాటిరేగ

వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు



వీధి కుక్కలను పట్టుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

విజయనగరం: నగరంలోని వివిధ ప్రాంతాలలో వీధి కుక్కలను అదుపులోకి తీసుకొని సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య వెల్లడించారు. విడతల వారీగా నగర వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు, యాంటీ రాబిస్ వ్యాక్సిన్‌ను వేయిస్తున్నామన్నారు. ప్రశాంతినగర్‌లోని 7వ నంబరు సచివాలయ పరిధిలో 28 వీధి కుక్కలను అదుపులోకి మంగళవారం తీసుకున్నారు. స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ, హరియాణ ఏజెన్సీ ద్వారా సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఈ సందర్భంగా తెలిపారు. కుక్కలకు స్థానిక కొత్తపేట కుమ్మరి వీధి దగ్గర ఉన్న డాగ్ షెడ్‌లో శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారు. ఏ ప్రాంతం నుంచి కుక్కలను తెచ్చారో, శస్త్ర చికిత్సలు అనంతరం ఆయా ప్రాంతాల్లోనే వాటిని విడిచిపెడుతున్నట్లు తెలిపారు. కుక్కలకు శస్త్ర చికిత్సలు అనంతరం ఐదు రోజుల పాటు పర్యవేక్షణలో ఉంచి ఆహారాన్ని అందించి, ఆరోగ్యంగా ఉన్నట్లు గుర్తించిన అనంతరం విడిచి పెడుతున్నట్లు కమిషనర్ తెలిపారు.

ఆశ వర్కర్లపై పనిభారం తగ్గించాలి



అరుంధతీనగర్ యూపీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న ఆశ వర్కర్లు

విజయనగరం ఫోర్ట్: ఆశ వర్కర్లపై పని భారం, ఒత్తిడి తగ్గించాలని ఆ యూనియన్ నాయకురాలు మహాలక్ష్మి డిమాండ్ చేశారు. పట్టణంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఆశ వర్కర్లు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశ వర్కర్లుకు పని ఒత్తిడి పెరుగుతున్నా జీతాలు పెరగడం లేదన్నారు. ప్రభుత్వాలు మారినా మా జీవితాల్లో మార్పు రావడం లేదన్నారు. 23 రకాల రికార్డులతో పాటు యాప్‌ల్లో వర్క్ పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు జగన్మోహనరావు, పద్మ, కనకమహాలక్ష్మి, నాగమ్మ, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.